నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. శంకర్‌మఠం ఫీడర్ పరిధిలోని పద్మాకాలనీ, నల్లకుంట, మాతృశ్రీ స్కూల్ తదితర ప్రాంతాలలో 10 గంటల నుంచి 12గంటల వరకు..

◆ చెన్నారెడ్డి నగర్ ఫీడర్ పరిధిలోని ప్రేమ్‌నగర్, అహ్మద్‌నగర్, పోచమ్మ టెంపుల్, సమోసా ఖార్ఖానా తదితర ప్రాంతాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

◆ ఆజామాబాద్ ఫీడర్ పరిధిలోని అచ్యుత్‌రెడ్డి మార్గ్, సీపీఎం ఆఫీసు, రాంనగర్‌గుండు తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 12గంటల నుంచి ఒంటిగంట వరకు..

◆ నల్లకుంట ఫీడర్ పరిధిలోని భారత్ ఇన్‌స్టిట్యూట్, విజయాబ్యాంక్, తిలక్‌నగర్ రోడ్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు..

◆ ఇందిరానగర్ ఫీడర్ పరిధిలోని తిలక్‌నగర్, కిషన్‌రావు హాస్పిటల్, ఇందిరానగర్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రొ. హరగోపాల్, గడ్డం లక్ష్మణ్‌ల అరెస్టు హేయం

ముషీరాబాద్: మైలారం గుట్ట మైనింగ్ అక్రమ తవ్వకాలను నిలిపివేయాలంటే వెళ్లిన ప్రొ. హరగోపాల్, ప్రొ. గడ్డం లక్ష్మణ్ ఇతర నేతలను నాగర్‌కర్నూల్ పోలీసులు కస్టడీలోకి తీసుకోవడం హేయమైన చర్య అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ అన్నారు. ఈ అక్రమ నిర్బంధాన్ని ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఈ మేరకు సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడితే ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరుగుతుందని చిలుక పలుకులు పలికి నేడు గద్దెనెక్కాక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణిచివేయడంలో గత ప్రభుత్వ వైఖరిని అవలంభిస్తుందన్నారు. పౌర హక్కుల సంఘాల నాయకులను, మేధావులను నిర్బంధించడం ప్రజాస్వామ్య పాలన ఎలా అవుతుందని వారు ప్రశ్నించారు. తక్షణమే మైలారంలో అక్రమ తవ్వకాలను నిలిపి వేయాలన్నారు. అక్రమంగా అదుపులోకి తీసుకున్న ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్ తదితర నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు సోమవారం మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ రంగానగర్, ఇందిరానగర్, తాజీర్‌నగర్, సిద్ధిక్‌నగర్, నవాబ్‌సాబ్ వీధి, గుల్షాన్‌నగర్ ప్రాంతాలలో అధ్వానంగా మారిన రోడ్లను వెంటనే ఆధునీకరించాలని కోరారు. ఇందిరానగర్ ఫస్ట్ వెంచర్‌లో అసంపూర్తిగా ఉన్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రహీమొద్దీన్, చాంద్, నియాజ్ అహ్మద్, అస్లామ్, ముజీమ్ హుస్సేన్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు పెంచాలి

కాచిగూడ: జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు పెంచాలని జాతీయ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.10వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు సముచిత స్థానం కల్పించి సీట్లు కేటాయించాలన్నారు. బీసీలను విస్మరించిన పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు పులిజాల కృష్ణ, ముత్యాల్‌రావు, డా.ప్రశాంత్ నీమ్‌కర్, భూషణ్ భాస్కర్, ప్రదీప్‌గౌడ్, కిషోర్ పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌పై రాళ్ల దాడి గర్హనీయం

లిబర్టీ: ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ నాయకులు రాళ్ల దాడి చేయడం గర్హనీయమని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా బీజేపీ నేత పర్వేశ్ వర్మకు చెందిన కొందరు అరవింద్ కేజ్రీవాల్ కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారని తెలిపారు. ఈ ఘటనలో కారు అద్దాలు పగలగా అదృష్టవశాత్తు అరవింద్ కేజ్రీవాల్‌కు ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బీజేపీకి భయం పట్టుకుందని, అందుకే ఆప్ ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఇలాంటి నీచమైన దాడులకు పాల్పడుతుందని మండిపడ్డారు. బీజేపీ పిరికిపంద చర్యలకు అరవింద్ కేజ్రీవాల్ భయపడరని, ఢిల్లీ ప్రజలు ఆప్ వెంటనే ఉన్నారని ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ గుండాల రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

మత్తుకు బానిసవ్వకండి..

దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

యాంటీ నార్కోటిక్ డీఎస్పీ రమేష్



కవాడిగూడ ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్

కవాడిగూడ: విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడకుండా తమ భవిష్యత్‌తో పాటు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాచకొండ యాంటి నార్కోటిక్ డీఎస్పీ రమేష్ పిలుపునిచ్చారు. విద్యార్థిని విద్యార్థులు ఎలాంటి వ్యసనాల బారిన పడకుండా చదువుకొని ఉత్తమ మార్కులు సాధించి చదువుతున్న పాఠశాలకు రాష్ట్రానికి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన సూచించారు. సోమవారం కవాడిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ యాంటీ నార్కోటిక్ విభాగం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు రాంప్రసాద్, ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు జీవన్‌రెడ్డి, నర్సింహ, ప్రిన్సిపాల్ మీనాకుమారి, ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా ప్రతి క్లాసురూంలో విద్యార్థులతో జరిగిన సమావేశంలో డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అన్ని రంగాల్లో రాణించాలని అయన సూచించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రతి విద్యార్థి డ్రగ్స్ మాదక ద్రవ్యాల పట్ల బానిసలు కాకూడదన్నారు. ప్రతి విద్యార్థి బంగారు భవిష్యత్ కోసం ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా కష్టపడి చదువుకొని మంచి పదవులు సాధించి కుటుంబాలను పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. పాఠశాలలు, సమీపంలో ఉన్న ఎవరైనా డ్రగ్స్, గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారం వస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ముషీరాబాద్: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలంగాణ నార్కోటిక్ విభాగం రాచకొండ డీఎస్పీ రమేష్ సూచించారు. సోమవారం డ్రగ్స్, గంజాయి వల్ల ఏర్పడే అనర్థాలను విద్యార్థులకు తెలియజేసేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వాడటం వల్ల ఏర్పడే అనర్థాలపై లఘుచిత్రం ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి నిర్మూలన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పని చేస్తుందన్నారు. విద్యార్థులు పెడదారి పట్టకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసవ్వడం వల్ల భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ సీఐ రాంబాబు, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, జీవన్‌రెడ్డి, లక్ష్మీపతి, ముషీరాబాద్ డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు ఫాతిమా, నరేందర్‌యాదవ్, రతన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ రమేష్

‘వేల గొంతులు.. లక్ష డప్పులు’కు తరలిరండి

ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతిని బొర్ర బిక్షపతి



బన్సీలాల్‌పేట్: ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల మాదిగ, మాదిగ ఉపకులాలు ఏళ్ల తరబడి విద్యా, ఉద్యోగ, రాజకీయపరంగా తీవ్రంగా నష్టపోయారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బొర్ర బిక్షపతి మాదిగ అన్నారు. బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగిన వేలగొంతులు...లక్షడప్పుల సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి డప్పుతో కదిలి రావాలన్నారు. మాదిగలు తాడోపేడో తేల్చుకోడానికి ఫిబ్రవరి 7న నగరంలో నిర్వహించే వేలగొంతులు...లక్షల డప్పులు కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఫిబ్రవరి 1న బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సన్నాహక కార్యక్రమానికి మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు చెప్పారు. ఎమ్మార్పీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహారావు, అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్, నాయకులు వీఎస్ రాజు, సత్యనారాయణ, అరుణ్, విజయ్, శ్రీనివాస్, మాచర్ల ప్రభాకర్, కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు



జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న క్రీడాకారుడు జశ్వంత్

ముషీరాబాద్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జరిగిన జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న సందర్భంగా కోచ్ పులికిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం తెలంగాణ కోచ్ పులికిషోర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన క్రీడాపోటీల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాల సహకరించిన డీఈవో రోహిణికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ డాక్టర్ కె.రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్‌కు సంపూర్ణ మద్దతు



బర్కత్‌పుర సామాజిక భవన్‌లో మాట్లాడుతున్న పోకల కిరణ్‌మాదిగ

కాచిగూడ: మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్ అభ్యర్థిత్వాన్ని బలరుస్తూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి చైర్మన్ క్రాంతికర్ పోకల కిరణ్‌మాదిగ తెలిపారు. సోమవారం బర్కత్‌పురలోని సామాజిక భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేషనల్ పొలిటికల్ ఫ్రంట్ పార్టీ చైర్మన్ వీజీఆర్ నారగోని, జాతీయ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గొల్లపల్లి దయానందరావుతో కలిసి అయన మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో పట్టభద్రుడై పోలీసు శాఖలో డీఎస్పీ స్థాయి ర్యాంకులో ఉండి తన పదవికి రాజీనామా చేసి పట్టభద్రుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వస్తున్నారని తెలిపారు. గంగాధర్‌పై ఎవరిని పోటీకి నిలపవద్దని ఆయన ప్రధాన రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

ఫీవర్ ఆస్పత్రిలో యువతి హల్‌చల్



ఫీవర్ ఓపీ వద్ద హంగామా చేసిన యువతి, మాట్లాడుతున్న కుటుంబ సభ్యురాలు

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో గుర్తు తెలియని ఓ యువతి(25-30) ఒంటరిగా వచ్చింది. వచ్చి రావడంతోనే గట్టిగా అరుస్తూ ఓపీ వద్ద ఉన్న ఆస్పత్రి సిబ్బంది, రోగులపై దాడికి దిగింది. దీంతో భయాందోళనకు గురైన ఆస్పత్రి సిబ్బంది ఆమెను వారించేందుకు యత్నించారు. అయినా వినకుండా ఇంగ్లిషులో గట్టిగా అరుస్తూ సిబ్బందిపైకి దూసుకు వచ్చింది. ఆమె ప్రవర్తనను చూసిన ఆసుత్రి సిబ్బంది మతిస్థిమితంలేదని గ్రహించి 108కి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ఆమె మానసిక రోగిలా ఉందని, అలాంటి వాళ్లను ఒంటరిగా తాము ఆస్పత్రికి తీసుకెళ్లలేమని తేల్చి చెప్పారు.

◆ యువతి కావడంతో చేసేదేమి లేక ఆస్పత్రి అధికారులు నల్లకుంట పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న మహిళా పోలీసులు ఆమెను వారిస్తూ ఎంత సర్ది చెప్పినా అక్కడి నుంచి వెళ్లిపోకుండా ఓ గంటపాటు అలాగే గట్టిగా అరుస్తూ నానా హంగామా చేసింది. అంతలోనే అ యువతి కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి ఆమెను తీసుకుని వెళ్లి పోయారు. ఆమెకు పెళ్లి సంబంధాలు కూడా చూస్తున్నామని కుటుంబ సభ్యులు చెప్పారు.

◆ ఈ పరిణామంతో ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారని ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. ఎట్టకేలకు ఆ యువతి బంధువులు ఆమెను అక్కడి నుంచి తీసుకు వెళ్లడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పారు. కాగా నల్లకుంట డివిజన్ పరిధిలో నివాసముండే ఆ యువతి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అని తెలిసింది. ఏదో కారణంగా డిప్రెషన్‌తో కొంత కాలంగా పిచ్చిగా ప్రవర్తిస్తోందని సమాచారం.

ఎన్టీఆర్ పాటకు పట్టాభిషేకం

చిక్కడపల్లి: వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో సోమవారం ఎన్టీఆర్ పాటకు పట్టాభిషేకం శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పద్మశ్రీ , విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, దర్శకులు, నటుడు డాక్టర్ ఎన్టీ రామారావు అని కొనియాడారు. తొలుత 52 యుగళ గీతాలతో నిర్వహించిన గీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా గాయనీగాయకులను సన్మానించారు. వంశీ రామరాజు పర్యవేక్షణ చేసిన కార్యక్రమంలో ప్రముఖులు మధుర గాయకులు వీఆర్‌కే ఫణి, కరవోక సహకారం హృషికేష్, గాన కోకిల పి.అనంతలక్ష్మి, సుంకరి శైలజా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలి



సమీక్షలో కార్పొరేటర్ ఎ.పావనీ

చిక్కడపల్లి: పేదలను ప్రభుత్వం గుర్తించి రేషన్ కార్డులు ఇవ్వాలని సర్కిల్ 6- అసిస్టెంట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ డి.దీప్తిని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ కోరారు. సోమవారం సాయంత్రం ముషీరాబాద్ నియోజవర్గం గాంధీనగర్ డివిజన్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు ఇవ్వాలని అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారి దీపికను కలసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ కార్డుల ఎంపిక ప్రక్రియలో పలు సవరణలు చేస్తే మరికొంత మంది పేద కుటుంబాలకు చేయూత కలుగుతుందని అన్నారు. అదే విధంగా ఇదివరకు రేషన్ కార్డు దరఖాస్తు చేయని వారికి ప్రభుత్వం మరికొంత గడువును పొడిగించి దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారిణి కోరారు. పేదలకు న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారి దీపిక హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

కుల్లు గీత వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గౌడ ఐక్య సాధన సమితి 2025 నూతన సంవత్సర కేలండర్‌ను బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ కుల్లు గీత వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశామని సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షపతిగౌడ్, హరిచరన్‌గౌడ్, బింగి ఇందిరాగౌడ్, బాబూగౌడ్, శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆళ్వార్ దాస్ ఆశయ సాధనకు కృషి చేస్తాం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు ఆళ్వార్ దాస్ 22వ వర్ధంతి సభను సోమవారం సుందరయ్య పార్కులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. నడవండి నడిపించండి అనే ఉద్దేశంతో ఈ వాకర్స్ క్లబ్‌ను 1984లో స్థాపించారని అన్నారు. ఆయన ఆశయ సాధన తాము కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, మురళీకృష్ణ, రమేష్‌రెడ్డి, డాక్టర్ సునీల్, రత్నాకర్‌రెడ్డి, నిమ్మల రాజశేఖర్, రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న పి.వి.నిరంజన్‌రెడ్డి తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సుందరయ్యపార్కు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు తొలగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. సోమవారం సుందరయ్యపార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పి.వి. నిరంజన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సంపత్‌రెడ్డి, ఎస్ రమేష్‌రెడ్డి, హాస్ఫెడ్ డైరెక్టర్ అయిలి నేని కిషన్‌రావు, సీనియర్ వాకర్ రవి కుమార్, జాలివాకర్ జి. కృష్ణలు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఆక్రమణలకు గురైన డబ్బాలను తొలగించి ట్రాఫిక్ జామ్‌ను అరికట్టడం అభినందనీయమన్నారు. అయితే మళ్లీ ఎవరూ ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని అక్రమంగా డబ్బాలు వేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికీ కొంతమంది వ్యక్తులు ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి బ్యానర్లు కట్టుకోవడం జరిగిందని వారానికోసారైనా వచ్చి సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని వారు కోరారు. ముఖ్యంగా పార్కు చుట్టూ ర్యాంపులుగా కడితే వాకర్స్ తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని, దీనివల్ల పూర్తిగా ట్రాఫిక్ జామ్‌ను అరికట్టడానికి అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు.

నియామకం



బండి శేఖర్‌ముదిరాజ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీ జాగృతి సేన ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా బండి శేఖర్ ముదిరాజ్ నియమితులైయ్యారు. హైదరాబాద్ బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణయాదవ్‌ల చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కమిటీలు వేసి బీసీలలో చైతన్యం నింపాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానాలు సైతం బీసీలు కైవసం చేసుకునేలా కృషి చేయాలన్నారు. అనంతరం బీసీ జాగృతి సేన ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు బండి శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షులుగా నియమించినందుకు ఆర్.కృష్ణయ్య, బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణయాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువతతో కమిటీలు వేసి బీసీల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు గుజ్జకృష్ణ, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బేరి రామచంద్రయ్యయాదవ్, అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డు దుకాణాలను కాపాడాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం. శ్రీనివాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని శిథిలమైపోతున్న హౌసింగ్‌బోర్డు దుకాణాలను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ హౌసింగ్ బోర్డుకు సంబంధించిన 51 దుకాణాలు గత 15ఏళ్ల క్రితం మూతపడ్డాయని వాటిని ఎవ్వరికి కేటాయించకుండా పెండింగ్‌లో పెట్టడంతో ఆయా భవనాలు నిర్వహణ లేక శిథిలమైపోతున్నాయని వారు అన్నారు. కొన్ని దుకాణాలు ఆక్రమణలకు గురవుతున్నాయని తెలిపారు. దీనివల్ల ప్రజాధనం వృథాకావడంతోపాటు వ్యాపారాలతో నిత్యం కళకళలాడే బాగ్‌లింగంపల్లిలోని ప్రధాన రహదారి బోసిపోయినట్లుగా ఉందన్నారు. లక్ష రూపాయలు ఆదాయం వచ్చే దుకాణాలను మూసివేయడం వల్ల హౌసింగ్ బోర్డుకు నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయంపై గత ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని ఇప్పటి ప్రభుత్వమైనా తక్షణమే నిర్ణయం తీసుకుని దుకాణాలు తెరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. దశరత్, నాయకులు కె. రమేష్, ఆర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, నరేష్ తదితరులు

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 6వ తేదీన బీసీల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోను దుర్గానరేష్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణలతో కలిసి ఆయన చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 6, 7వ తేదీల్లో ఢిల్లీలో ఓబీసీ జాతీయ స్థాయి సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 75 ఏళ్లలో 121 సార్లు రాజ్యాంగ సవరణ బిల్లులు ప్రవేశ పెట్టారు కానీ బీసీలకు రాజ్యాధికారంలో వాటా కల్పించడానికి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు రంగు విక్రమ్, నందగోపాల్, రామకృష్ణ, సుగుణ, గొరిగే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజస్వామి కీర్తనలు



మాట్లాడుతున్న తెలుగు యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ గౌరీశంకర్

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణం త్యాగరాజస్వామి కీర్తనలతో మార్మోగింది. శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజస్వామి 56వ వార్షిక ఆరాధనా సంగీతోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం సాయంత్రం కలిగొట్టి మల్లికార్జునరావు రమాదేవి, బాడిద శివకాంత్ మంజుల దంపతుల సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు డి.రవికాంత్, శివకృష్ణ శిష్య బృందం ఆలపించిన కీర్తనలు, ఎ.శివకృష్ణ స్వరూప్, హృతిక ద్వయం వయోలిన్ కచేరి ఆహుతులను ఆద్యంతం అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భట్టిప్రోలు హరిప్రియ, తెలుగు యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ గౌరీశంకర్ హాజరై ప్రసంగించారు.

కృష్ణంరాజు ప్రతిభా పురస్కారాల ప్రదానం



పురస్కారాలను ప్రదానం చేస్తున్న ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, గజల్ శ్రీనివాస్

కాచిగూడ: ప్రముఖ హీరో, మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ రెబెల్‌స్టార్ కృష్ణంరాజు జయంతిని పురస్కరించుకుని ఎఫ్‌టీపీసీ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు కృష్ణంరాజు పేరుతో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ప్రభుత్వ విప్ రామచంద్రుల నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డులను ప్రదానం చేశారు. దుబాయ్‌కి చెందిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు జితేంద్ర మైథలానేతో పాటు బాలీవుడ్ నటీమణులు ధనిబోస్, మోక్ష, అనీషా ముఖర్జీ, నేహాషాలకు ప్రత్యేక పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు చైతన్య జంగా, విజయ్ వర్మ పాకలపాటి మాట్లాడుతూ.. ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఘజల్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, సినీ దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, నటుడు గౌతంరాజు, శివ కృష్ణ, కృష్ణుడు, నేమింగ్ ప్రేమి తదితరులు పాల్గొన్నారు.